# శైవ-వైష్ణవ పాశురాలు



ఎంతో తేజోవంతుడైన (మహాప్రకాశంగల) రవి (సూర్యుడుఅని అర్థం. జ్యోతిశ్శాస్త్రం ప్రకారం రవి అంటారు) మేషం, వృషభం, మిథునం... అని ఈ తీరుగా ఉండే 12 రాశులలోనికీ నెలకొక్క రాశిచొప్పున ప్రవేశిస్తూ ప్రవేశిస్తూ ఒక నెలకాలం పాటు అదే రాశిలో ఉంటూ ఉంటాడు. ఆ క్రమంలో రవి ధనుస్సు (ధనస్సు అనకూడదు) అనే 9వ రాశిలోనికి ప్రవేశించినప్పుడు దాన్ని 'ధనుర్మాసం' అంటారు.

## కాలాన్ని లెక్కించే మానాలు

దేన్నైనా కొలవాలీ అంటే ఏదో ఒక పరికరం ఉండాలిగా కొలిచేందుకు. అలా కాలాన్ని కొలవాలీ అంటే దానికి కొలిచే విధానాలు 5 ఉన్నాయి.

ఆ కొలవడాన్నే 'మానం' అంటారు శాస్త్ర పరిభాషలో. మొదటిది చాంద్రమానం. చంద్రుని గమనాన్నిబట్టి కొలవడమని అర్థం.చంద్రుడు ఉదయించిన మొదటి రోజు ప్రథమ (పాడ్యమి).

రెండవ రోజు ద్వితీయ (విదియ). మూడవ రోజు తృతీయ (తదియ). చతుర్థి, పంచమి...ఇలా 15వ రోజైన పూర్ణిమ వరకూ లెక్కిస్తే దాన్ని శుద్ధపక్షం అన్నారు. అమావాస్యవరకూ లెక్కిస్తే బహుళ (కృష్ణ) పక్షం అన్నారు. ఇదే తీరులో సూర్యుని గమనాన్నిబట్టి లెక్కిస్తే దాన్ని చాంద్రమానంలాగా దీన్ని సౌరమానం అని పిలిచారు. ఈ సౌరమానం ప్రకారం ప్రారంభంలో అనుకున్న విధంగా ధనూరాశిలోనికి రవి ప్రవేశించాడు కాబట్టి ధనుర్మాసం అన్నారు. ఇలాగే బృహస్పతి (గురువు) ప్రవేశించడాన్ని బార్హస్పత్యమానం (పుష్కరాలని దీన్ని బట్టే నిర్ణయిస్తారు)-వ్యక్తులు పుట్టిన నక్షత్రంబట్టి లెక్కిస్తే నాక్షత్రమానం (వ్యక్తికి సంబంధించిన జాతకాలని దీన్నిబట్టే చెప్తారు)-

ఇక యజ్ఞాలూ మొదలైనవాటిని చేసేందుకు సరైన రోజులని నిర్ణయించే ఆ లెక్కని- 'సవనం' అంటే యాగమని అర్థం కాబట్టి- సావనమానం అన్నారు. ఇలాటి 5 మానాల్లోనూ ప్రస్తుతం సౌరమానంప్రకారం వస్తుంది ఈ ధనుర్మాసం. ఈ నెలరోజులపాటూ శివుణ్ణే మాత్రమే ఆరాధించేవారు 'తిరువెంబావై' పాశురాలనీ (దైవ కీర్తనలు)-విష్ణువుని మాత్రమే ఆరాధించేవారు తిరుప్పావై పాశురాలనీ గానంచేస్తూ ప్రచారం చేస్తుంటారు ప్రతిరోజూ.

## రెండు పాశురాల్లో పోలికలు

ఒకప్పుడు మరింత తీవ్రంగా ఉండే శివకేశవ భేదం ఈ రోజుల్లో ఎక్కడోగాని లేనే లేదు. అందరూ, ఇద్దరి దేవాలయాలకీ వెళ్తూనే ఉన్నారు. పూజాపురస్కారాలని చేసుకుంటూనే ఉన్నారు. అయితే ఏదో పాత కాలపు ఛాందస భావాలున్న ఏ ఒకరో, ఇద్దరో మాత్రం ఆ వాసనని పోగొట్టుకోలేక ఇంకా శివ-కేశవ భేదాన్ని తాము పాటిస్తూ రహస్యంగా శివకేశవులిద్దరూ ఒకటి కారని ప్రచారాన్ని చేసుకుంటూ కన్పిస్తున్నారు.

ఏ పెద్ద వేదికమీదో నిలబడి బల్లగుద్ది 'శివకేశవ భేదం ఉండి తీరాల్సిందే!' అని చెప్పే సాహసాన్నిచేయలేకపోతున్నారు. అలా శివకేశవ భేదాన్ని పాటించిన రోజుల్లో శివారాధకులు తిరువెంబావైని-

వైష్ణవులు తిరుప్పావైని గానంచేస్తూ ఉండేవారు ప్రచారం నిమిత్తం. ఇద్దరిలో- ఆ రెండు విధానాల్లో పోలికల్ని గమనిద్దాం!

'మాణిక్యవాచగర్' (మాణిక్యం ఎంత ఆకర్షణీయంగా ఉంటుందో అలా తన మాటలతో చక్కగా ఆకట్టుకునే తీరులో మాట్లాడే ఒక తమిళ కవి 9వ శతాబ్దంవాడు శైవ సూక్తాలతో తిరు-వెంబావైని రచించాడు. కేవలం విష్ణుభక్తిని మాత్రమే పాటిస్తూ ఉండే విష్ణు చిత్తుడనే పేరున్న ఓ విష్ణు ఆలయ అర్చకునికి తులసివనంలో కర్కాటకరాశిలో ముద్దులు మూటగడుతూ ఓ శిశువు కనపడింది (అ-యోని-జ).

ఆమె చక్కని ఓ పూమాలలా అన్పించగానే తండ్రి 'కోదై' (పవిత్రురాలైన పూమాలవంటి ఆడపిల్లా!) అని అప్రయత్నంగా పిలిచాడు. ఆ 'కోదై'నే నేడు గోదాదేవిగా మారింది అందరి నోళ్ళలోనూ పడి.

తిరువెంబావైలో కన్నెలందరూ నుదుట విభూతి రేఖలని ధరించి మాణిక్యవాచగర్ ఏర్చికూర్చి చేసిన ఆ శైవ పాశురాలని పాడుతూ చక్కని నృత్యంతో మార్గం వెంట వస్తూ-ఏకకంఠంతో (అందరు గానం చేస్తున్నప్పటికీ ఒకే గొంతుతో పాడుతున్నారా? అన్నట్టు) పాడుతూంటే అటూఇటూ పక్కల మేడల మీద నిలబడ్డ అందరూ పూవుల్నీ, పేలాలనీ చల్లుతూ ఉండేవారు.ఆ పాడే శివకీర్తనల్లోని రహస్యాలని అర్థం చేసుకుంటూ ఆనందపడుతూండేవారు.

ఇదే తీరుగా తిరుప్పావైలో గోదాదేవే స్వయంగా హృదయంలోనుండి వచ్చిన తీవ్ర భక్తి భావానికనుగుణంగా ఏర్చికూర్చిన ఆ విష్ణు పారమ్య కీర్తనలనిగానం చేస్తూ ఎక్కడెక్కడ ఇంకా నిద్రిస్తూ ఉన్నఅందర్నీ నిద్రలేపి సిద్ధంచేస్తూ అందర్నీ కృష్ణ దర్శనానికి తీసుకుపోతూండేది. ఈ కీర్తనల్లో కూడా కృష్ణునిలో దాగిన అనేక రహస్యాలని వివరిస్తూ కృష్ణునిమీది భక్తిని మరింతగా ప్రచారం చేస్తూండేది.

హేమంత ఋతువులో ఎముకలు కొరికే చలిలో తెలవారుజామునే లేవడం, స్నానాన్ని చేసుకుని సిద్ధం కావడం, అంతేకాక గొంతెత్తి పాడడం, నృత్య భంగిమని ప్రదర్శించడంవంటి ఇవన్నీ శారీరక ఆరోగ్యాన్ని వృద్ధిచేసే విధానాలే. అంతేకాక ఏ రోజున దైనందిన

కార్యక్రమం దేనితో ప్రారంభమవుతుందో- ఏ పాటని వింటూ నిద్ర లేచామో- ఆ రోజు రోజంతా అదే పాట శరీరంలోని 72 వేల నాడుల్లోనూ ప్రతిధ్వనిస్తూ ఉంటుంది.దాంతో శరీరం దైవభక్తిమయం అవుతుంది.

అంతే కాక దైవ దర్శనం చేసుకునే కారణంగా ఆ దైవం కళ్ళ ముందు రోజు రోజంతా దర్శనాన్ని ఇస్తూ ఉంటాడు కూడా తలుచుకుంటే చాలు. ఈ విధానాన్ని ఈ రెండు తీరుల వాళ్ళూ మనకి నేర్పారు ఓ నెలరోజుల పాటు. తిరువెంబావైలో శివుడి గురించిన ఆరోపణలకి సమాధానాలు విస్పి స్తాయి. ఉదాహరణకి శివుడు తన పుత్రుడైన వినాయకుణ్ణే వధించాడు గదా! ఎలా దైవం అవుతాడు?


మామ అయిన దక్షుని యాగాన్ని వీర భద్రుడనే పేరున్న తన దూత ద్వారా ధ్వంసం చేయించడమే కాక, తలని నరికించి హోమకుండంలో వేయించి హుతం (భస్మం) చేయించాడా? తన భార్య పార్వతి అంతటి మహాలావణ్య శేవధి:(అందాలగని) అవుతూంటే తాను మాత్రం భూత, ప్రేత, పిశాచాలతో, మెడలో ఎముకల దండలతో స్మశానంలో నివశిస్తూ ఉంటాడా?

అందరికీ భయం కలిగేలా విషంవల్ల మరణం వస్తుందని తెలిసికూడా విషాన్నితాగి మొత్తానికిమెడని నీలి రంగుగా చేసుకుని బయటపడ్డాడా?

భస్మ అనే పేరున్న రాక్షసుడికి-వాడు ఎవరి నెత్తిన చేయిపెడితే వాళ్ళు భస్మమయ్యే వరాన్ని అమాయకంగా ఇచ్చేసి- దాన్ని పరీక్షించదలచి వాడే తన నెత్తి మీద చేయిపెట్టబోతే తానూ తన పత్ని పార్వతితో సహా పారిపోయారా?...అనే ఇటువంటి అంతరార్థం దాగిన ప్రశ్నలని లేవనెత్తి వాటికి సంబంధించిన లో విశేషాన్ని తెలుపుతూ వెళ్తాండేవాళ్ళుశైవపాశురాలని కీర్తించే నర్తకీమణులు.

ఇదే తీరుగా వైష్ణవ పాశురాలలో కూడా శ్రీకృష్ణునికి సంబంధించి ఎంతో అంతరార్థం దాగిన కొన్ని ప్రశ్నలని లేవనెత్తి వాటికి సంబంధించిన లో విశేషాల్ని తెలుపుతూ వెళ్తాండేవాళ్ళు తిరుప్పావై గానంచేసే ఆ యువతులు గోదాదేవి నేతృత్వంలో. ఉదాహరణకి- ఏమాత్రపు రాజరికపు అర్హతలేని కృష్ణుడు నిరంతరం రాజ వేషంలోనే ఉండేవాడా?

(ద్వాపరయుగ కాలానికి వృష్ణి వంశజులకి రాజ్య పరిపాలన అర్హతలేదు) దేవుడైనవానికి అసత్య మాడడం- వంచించడం-దొంగతనం చేయడం వంటివి ఉండనే ఉండకూడదు కదా (అస్తేయం పరమాత్మనః)... అలాటివన్నీ ఉన్న కృష్ణుడు దైవంఎలా అవుతాడు?



రామచంద్రునిలాగా ఏకపత్నీవ్రతుడై ఆమెయుందే తన సంపూర్ణ ప్రేమానురాగాలు ఉండవలసివస్తే అష్ట భార్యలని వివాహమాడాడా? ధర్మరాజు రాజసూయ యాగ సభని చేస్తే ఆ నిండు సభలో తనకి తానుగా సుదర్శన చక్రాన్ని పంపి అందరు రాజులు, మహర్షులు, పూజ్యుల సమక్షంలో శిశుపాలుని తలని నరికేసాడా? నిరంతరం తనకి తానుగా తానే దైవమని ప్రకటించుకుంటూ ఉన్నాడా?

అదే నిజమైయుంటే పాండవులు, కౌరవులు ద్యూతం 12 +1 ఏళ్ళపాటు అరణ్యాజ్ఞాతవాసాలు... వంటివేమీ లేకుండా ప్రశాంతంగా కథని నడిపి ఉండవచ్చుగా? తనని మాత్రమే నమ్ముకున్న అర్జునుని ఏకపుత్రుడు (ఏకైక పుత్రుడు అనకూడదు.

ఏకైక అంటే ఒకరి తరువాత మరొకరి చొప్పున అని అర్థం) అభిమన్యుని వధని చేయించాడా?

తనకి సోదరి వరస అయిన ద్రౌపదికి నిండు సభలో అందునా స్త్రీ అశుచిగా ఉండే మూడురోజుల్లోని మొదటిరోజునాడు వస్త్రాపహరణావమానాన్ని చేయించాడా?

## ఆధ్యాత్మిక భావవిశేషాలు

పాండవుల్లో మొదటివాడైన కర్ణుణ్ణి పాండవుల నుండి వేరుచేస్తూ కౌరవపక్షాన ఉండేలా చేయడమే కాక, పాండవులకి వ్యతిరేకంగా పోరాడేలా చేశాడా?... వంటి అనేక అనుమానాలకి సమాధానాలని సప్రమాణంగా ఇస్తూ ఆధ్యాత్మిక భావవిశేషాలతో సమాధానాల్ని ఇస్తాయి ఈ తిరుప్పావై పాశురాలు.

తిరువెంబావై 30 రోజుల ముగింపు రోజున శివ పార్వతుల కల్యాణం అతిరమణీయంగా జరిగితే- తిరుప్పావై ముగింపునాడు గోదారంగనాథుల పరిణయం అతి సుందరంగా జరుగుతుంది.

రెండు పాశురాల గానం అయిన వెంటనే ఆరోగ్యానికి భంగం కలగకుండా ఉండే రుచికరమైన ప్రసాదం శైవ వైష్ణవ కీర్తనలు గానంచేసిన ఇరు తీరుల భక్తజనానికీ అందించబడుతూండేవి.

ఇలా ఏ తీరుగా గమనించినా ఇరు తీరుల పాశురాలకీ సమన్వయం పోలికా మాత్రమే కన్పిస్తూ ఉంటుంది తప్ప పరస్పర ద్వేషభావం ఏమాత్రమూ ప్రత్యక్షంగా కన్పించదు.

ఎవరి భక్తి భావాన్ని వాళ్ళకి వాళ్ళు ప్రదర్శించుకోవడమనేది ఎంత ఆరోగ్యకరమైన ప్రచారం! అయితే కొందరు మాత్రం మరో ప్రచారకులమీద ఓ విమర్శనాస్త్రాన్ని సంధిస్తూ- తాము శివుణ్ణే, విష్ణువునీ ఆరా ధించకపోవడానికొక కారణముం దంటూ ఓ చిత్రమైన బలహీనవాదాన్ని చేస్తూ కన్పిస్తారు. ఏ స్త్రీ అయినా వివాహితురాలైన తర్వాత తన భర్తని మాత్రమే ఆరాధిస్తుంది-ఆచరిస్తుంది తప్ప మరొకర్ని ఆరాధించ(లే)దు కదా! అలాటప్పుడు శివకేశవుల్లో ఒకరి పక్షానికి మాత్రమే చెందిన ఆమె మరొకరిని ఎలా ఆరాధిస్తుంది? అలా ఆరాధించడం పతివ్రతాలక్షణంకాదుగదా! నేరమేకదా!-అని.

ఆ వాదాన్నే తీసుకుని చూద్దాం! వివాహితురాలైన ఆమె తన భర్తనే ఆరాధించాలనేది నూటికి నూరుపాళ్ళూ ధర్మబద్ధమైన మాటే. అయితే తానొకరికి భార్య అయినంతమాత్రాన ఇతర స్త్రీల భర్తలని ద్వేషించడం సబబు కాదు గదా!

శైవులు, వైష్ణవులనే ఇరు జాతుల్లోనూ శైవులు, విష్ణువునీ-వైష్ణవులు శివుణ్ణీ ద్వేషించడం, ఆ దేవుని ఆలయాలు కన్పిస్తూంటే విసనకర్రని చాటుచేసుకుని ఆలయం పక్కగా వెళ్తాండడం అది సరైన తీరవుతుందా? హిందూధర్మమనేదే గాలికి చిరిగిపోతున్న అరటాకులా పేలవంగా ఉంటూంటే, ఈ శివకేశవ భేదాన్నిగాని పాటిస్తూ పరస్పర ద్వేషాన్ని చేసుకుంటూ పోతే పై మతాలవారికి హిందూ ధర్మం ఎంత పలుచన అయిపోతుంది?

ఎంతో అదృష్టవంతులం కాబట్టి ఓ 15-20 సంవత్సరాలనుండి మనకి కళ్ళు తెరుచుకుంటున్నాయి రోజురోజుకీ. ఈ సమయంలో పరస్పర ద్వేషం ఏ మాత్రమూ సమంజసం కాదు!

డా॥ మైలవరపు శ్రీనివాసరావు